సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



మదనపల్లెను జల్లెడ పట్టిన పోలీసులు

మదనపల్లెలో గురువారం వేకువజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 490 మంది పోలీసు సిబ్బందితో ప్రతి ఇల్లు తనిఖీ చేశారు. -IIలో



దర్బారు సాయి నగర్‌లో దసరా మహోత్సవాలు

రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్బారు సాయి నగర్‌లో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.520	రూ.600
రెండోరకం	రూ.380	రూ.500



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 116 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	560
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 320.160 కిలోలు

గ్రీన్ ఫీల్డ్ హైవేకి గ్రహణం!

శ్రీ వెంకటేశ్వరస్వామి పాదపద్మాల చెంత ఉన్న తిరునగరికి.. శ్రీనివాసుని తొలిగడప కడప నుంచి ఫోర్‌లైన్ రోడ్డు (సూరత్–చెన్నై హైవేలో) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపన చేసి ఏడాది పూర్తయింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. 130 కి.మీ దూరం రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీన్నే గ్రీన్‌ఫీల్డ్ హైవేగా కేంద్రం గుర్తించింది. వైల్డ్‌లైఫ్ అనుమతులు ఇవ్వని నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది.

- హైవేకి గడ్కరీ చేసిన శంకుస్థాపనకు ఏడాది పూర్తి
- కడప–రేణిగుంట రోడ్‌లో నిత్యం ప్రమాదాలే
- సూరత్–చెన్నై హైవేలో భాగమే కడప–రేణిగుంట రోడ్
- పనులకు అడ్డంకిగా కేంద్ర అటవీశాఖ అనుమతులు



రోడ్డు ఇలా..

జిల్లా	దూరం
తిరుపతి	20కి.మీ
వైఎస్సార్, అన్నమయ్య	110 కి.మీ

అంచనా వ్యయం: రూ. 2,350 కోట్లు

ఫోర్‌లైన్ ఇలా...

- రేణిగుంట నుంచి కరకంబాడి, మామండూరు, బాలపల్లె, శెట్టిగుంట వరకు ఉన్న రహదారినే ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు.
- రైల్వేకోడూరుకు ముందు భాగంలో బైపాస్ మార్గం ఏర్పాటు. ఇక్కడ నుంచి అయ్యపురెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, భాకరాపేట పడమర దిశగా ఫోర్‌లైన్ వెళ్లనున్నది.

రాజంపేట: శేషాచలం అటవీ ప్రాంతంలో పచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణంను అందించనున్న గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు వైల్డ్‌లైఫ్ అనమతుల గ్రహణం పట్టుకుంది. గుజరాత్‌లోని సూరత్–చెన్నై మధ్య నిర్మితమవుతున్న జాతీయ రహదారిలో భాగమే కడప–రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే. ఇప్పుడు ఈ రహదారికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుంది. శంకుస్థాపన జరిగి ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. ఇందుకు కారణం అటవీశాఖ అనుమతులు రాకపోవడమే. రూ. 2,350 కోట్ల పనులకు కేంద్ర అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారాయన్న విమర్శలున్నాయి.

అనుమతుల కోసం ఎదురుచూపు ..

కడప–రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణం కోసం వైల్డ్‌లైఫ్ (కేంద్ర అటవీ పర్యావరణ శాఖ) నుంచి అనుమతులు ఎప్పుడు వస్తాయా.. అని ఎదురు చూస్తున్నారు.

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అటవీ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ మేరకు నైన్ కమిటీ సమావేశంలో ఆమోదం కలిగింది. మొదటిదశ అటవీశాఖ ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లాయి. అక్కడి నుంచి ఈ ప్రతిపాదనల నేపథ్యంలో కేంద్రబృందం పరిశీలన చేపడుతుంది. ఆ బృందం నివేదిక అనంతరం వైల్డ్‌లైఫ్ అనుమతి లభించనున్నది.

తక్కువ వ్యవధిలోనే తిరుపతి..

కడప–రేణిగుంట ఎన్‌హెచ్ ఏర్పడిన తర్వాత తక్కువ వ్యవధిలో తిరుపతికి చేరుకునే పరిస్థితులు ఆవిష్కృతమవుతాయి. ఫలితంగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన తిరుపతి, చెన్నై నగరాలకు వెళ్లే వారికి కడప–రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల త్వరితగతిన గమ్యానికి చేరుకునే వీలు కలుగుతుంది.

భూసేకరణ జరిగిన ప్రాంతాలివే..

కడప, చింతకొమ్మలదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట, నాగిరెడ్డిపల్లె , పాటూరు (నందలూరు), రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, శెట్టిగుంట (రైల్వేకోడూరు).

సీమ జిల్లాలకు ముఖ్య రహదారిగా..

రాయలసీమ జిల్లాలకు ముఖ్య రహదారిగా ప్రాచుర్యం పొందిన ఈ రహదారిలో జాతీయ రహదారి పనులలో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు చాలా వరకు భూసేకరణలో పరిహార అంశం వివాదంగానే ఉంది. బాధితులు ఇప్పటికీ కలెక్టర్‌ను, ప్రజాప్రతినిధులను కలిసి మొరపెట్టుకుంటున్నారు. కడప–రేణిగుంట హైవే నిర్మాణానికి రూ.4వేల కోట్లు కేటాయింపులు వివిధ పనుల రీత్యా కేటాయించింది. అయితే ప్రాజెక్టు వ్యయం మాత్రం రూ.2,350 కోట్లు కేటాయించారు. గత ఏడాది జూలైలో కేంద్ర మంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. అయితే పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

ఎంపీ మిథున్‌రెడ్డి కృషి..

కడప–రేణిగుంట నేషనల్ హైవే త్వరితగతిన నిర్మాణంకు వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తన వంతుగా కృషి చేశారు. ఇందుకు ప్రధానంగా కేంద్రం తీసుకున్న ప్రాయర్టీలో కడప–రేణిగుంట ఎన్‌హెచ్‌ను చేర్చేలా విశ్వప్రయత్నాలు చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, మరోవైపు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇపుడు అటవీ అనుమతులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

ఒంటిమిట్ట, నందలూరుకు స్పెషల్ కనెక్టివిటీ అవసరం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలైన నందలూరు, ఒంటిమిట్ట కేంద్రాలకు ఎన్‌హెచ్ నుంచి కనెక్టివిటీ రోడ్ (సర్వీసురోడ్డు) అవసరమని పలువురు భక్తులు కేంద్రాన్ని కోరుతున్నారు.

హైవే రాకతో తగ్గనున్న ట్రాఫిక్..

ప్రస్తుత కడప–రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబాయి, హైదరాబాదు మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ఈ ట్రాఫిక్‌కు ప్రస్తుతం ఉన్న హైవే కెపాసిటీ సరిపోవడం లేదు. ఫలితంగా ప్రమాదాలు, ట్రాఫిక్ స్తంభించిపోవడం లాంటివి తరుచుగా జరుగుతున్నాయి.

అనుమతులు త్వరితగతిన ఇవ్వాలి



కడప–రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణ పనులకు వైల్డ్ లైఫ్ అనుమతులు త్వరగా ఇవ్వాలి. ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఒంటిమిట్ట, నందలూరులో ఉన్నందున కనెక్టివిటి రోడ్డు నిర్మించాలి. – అరిగె మణి, అధ్యక్షుడు, అరిగె సేవా ట్రస్ట్, నందలూరు

హైవే నిర్మాణంలో జాప్యం తగదు



కేంద్రం వైల్డ్‌లైఫ్ అనుమతులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వీడాలి. ఇప్పటికే ఉన్న పాతరోడ్డు (డబుల్ లైన్)లో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. భారీ వాహనాల ట్రాఫిక్ అధికంగా ఉంది.
– లక్ష్మీప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేత, కువైట్



న్యూస్‌రీల్

నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధిపై శిక్షణ

రాయచోటి: గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కడప, అన్నమయ్య జిల్లాల నిరుద్యోగ యువకుల కోసం ఈనెల 14వ తేదీ నుంచి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో కెనరా బ్యాంకు జిల్లాశాఖ తెలియజేసింది. మొబైల్ అండ్ సర్వీస్, ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో ఉచిత ట్రెనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభం కానున్నాయి. 18 నుంచి 45 సంవత్సరాలు వయసున్నవారు అర్హులు. శిక్షణ 30 రోజులపాటు ఉంటుందని, శిక్షణ సమయంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత భోజనం, వసతి ఉంటుందని వారు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9440905478, 99856 06866 నంబర్లను సంప్రదించగలరు.

ప్రభుత్వ పథకాలు రైతులకు చేరవేయాలి



మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

రైల్వేకోడూరు అర్బన్: రబీ సీజన్ నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు చేరే విధంగా వ్యవసాయ అధికారులు, రైతు సేవాకేంద్రంలో సిబ్బంది కృషి చేయాలని గురువారం జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ ఆదేశించారు. స్థానిక సభా భవనంలో వ్యవసాయ అధికారులు, అనుభంద శాఖల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో లాభాల బాట పట్టడానికి సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కవిత, ఏఓ సుధాకర్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కడప కలెక్టర్ తెలంగాణకు కేటాయింపు

కడప సెవెన్‌రోడ్స్: కడప కలెక్టర్ శివశంకర్ లోతేటిని తెలంగాణ రాష్ట్రానికి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆంధ్ర, తెలంగాణ క్యాడర్ విభజనపై కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన సమయంలో అధికారులను ఏపీ, తెలంగాణలకు కేంద్రం సర్దుబాటు చేసింది. వివిధ కారణాలతో అక్కడి వారు ఇక్కడ, ఇక్కడి వారు అక్కడ పనిచేస్తున్నారు. విభజన సమయం నుంచి నానుతూ వచ్చిన అధికారుల కేటాయింపు అంశం ఎట్టకేలకు పరిష్కారమైంది. తెలంగాణ క్యాడర్‌కు చెందిన కడప కలెక్టర్ శివశంకర్ లోతేటిని ఆ రాష్ట్రానికి కేటాయించారు. ఆంధ్ర, తెలంగాణ క్యాడర్ ఐఏఎస్‌లు ఈనెల 16వ తేదీలోపు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

‘పల్లె పండుగ’ జయప్రదం చేయండి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై గురువారం జిల్లా, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వారోత్సవాలలో పంచాయతీశాఖ ద్వారా రూ. 71 కోట్లకు సంబంధించి 723 పనులను చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. వీటికి అదనంగా పంచాయతీలోని సాధారణ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయని తెలిపారు. కార్యక్రమాలను ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. గ్రౌండింగ్ చేసిన పనులన్నింటినీ జియోట్యాగ్ చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో చేపట్టే పనులు గ్రామాలకు స్థిరాస్తిగా నిలిచిపోతాయని, నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎస్ఈలు, జడ్పీ డిప్యూటీ సీఈఓ, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి, ఎంపీడీఓలు, ఉపాధి , పంచాయతీరాజ్, ఈఓపీఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల డిగ్రీ కోర్సులలో నేరుగా ప్రవేశాలు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఫైన్‌ఆర్ట్స్, బీకాం ఆనర్స్ కోర్సులలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపులలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 12వ తేదీలోపు విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలోని సంచాలకుల కార్యాలయంలో అన్ని రకాల అర్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఎం శశికుమార్ (ఎర్త్ సైన్స్- 8985597928), రాజేష్ (బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ -90140 46537) వెంకటేష్ (ఫైన్ ఆర్ట్స్ -90100 14304)ను సంప్రదించాలని సూచించారు.

జయజయహే మహిషాసురమర్దిని



అమ్మవారిశాలలో మహిషాసురమర్దినీదేవి

ప్రొద్దుటూరు కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో 8వ రోజు గురువారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మహిషాసురమర్దినీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. గుహలో మర్రి చెట్లు, అస్థిపంజరాలు, భూతాల బొమ్మలు, పాముల సెట్టింగ్ అందరిని ఆకట్టుకుంది. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా అలంకరించారు. 43వేల గాజులతో అమ్మవారి శ్రీచక్రం సెట్టింగ్, దేవతా మూర్తులు, వారాహి అమ్మవారి సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అధికారం మాదే.. షాపులన్నీ మావే!



- మద్యం షాపుల వ్యవహారంలో ఆధిపత్యం చలాయిస్తున్న టీడీపీ నేతలు
- జిల్లా వ్యాప్తంగా 111 షాపులకు 1465 దరఖాస్తులు
- అన్నిచోట్లా షాపులకు కూటమి నేతల సర్దుబాట్లు
- ఇతరులెవరు దరఖాస్తు చేసినా ... ఇబ్బందులు తప్పవని హుకుం

సాక్షి రాయచోటి: అధికారాన్ని అడ్డుపెట్టుకుని మద్యం షాపులన్నీ దక్కించుకోవాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ దిశగా అధికారులను సైతం ప్రభావితం చేస్తున్నారు. ప్రతిపక్షం వారికి షాపులు దక్కినా ఎలా నిర్వహిస్తారో చూస్తామంటూ హుకుం జారీ చేస్తుండడంతో... తర్వాతైనా ఇబ్బందులు తప్పవని ఇతర పార్టీల నేతలు భావిస్తున్నారు. అధికార వర్గంలోని మూడు పార్టీల కలయిక కొంతమేర షాపుల విషయంలో అలకలకు దారి తీస్తోంది.

సమీపిస్తున్న గడువు..

అన్నమయ్య జిల్లాకు సంబంధించి 111 మద్యం షాపులకు ఎక్సైజ్‌శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందుకు సంబంధించి ఈనెల 1 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అయితే ఆఫ్‌లైన్ ద్వారా తీసుకుని వెళితే అధికార పార్టీ వారి ద్వారా ఒత్తిళ్లు వస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా పీలేరు నియోజకవర్గంలో కొంతమంది అధికారులు ఏకంగా ఆఫీసులకు వెళితే ఏ పార్టీ అని అడిగి తీసుకునే పరిస్థితి నెలకొన్నట్లు తెలియవచ్చింది. కాగా మద్యం షాపులన్నీ టీడీపీ నేతలు సొంతం చేసుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. మనం మనం అందరం ఏకమైతే షాపులన్నీ మనవేనంటూ పొరుగు నియోజకవర్గాల నేతలతో మంతనాలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గం	కేటాయించిన షాపులు	వచ్చిన దరఖాస్తులు
మదనపల్లె	16	375
పీలేరు	18	120
రాజంపేట	18	174
రాయచోటి	19	322
తంబళ్లపల్లె	15	276
రైల్వేకోడూరు	22	198
మొత్తం	111	1465

లక్కీడిప్‌కు ఏర్పాట్లు..

జిల్లాలో మద్యం షాపులకు సంబంధించి దరఖాస్తులకు శుక్రవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రానికి 111 షాపులకుగాను 1465 దరఖాస్తులు వచ్చాయి. అందుకు సంబంధించి శుక్రవారం ఒక్కరోజే గడువు ఉండడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. లక్కీడిప్ రాయచోటి అజయ్ కల్యాణ మండపంలో తీసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికార పార్టీ ఆధిపత్యం: జిల్లాలో అధికార పార్టీ నాయకులు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఎక్కడికక్కడ అన్ని నియోజకవర్గాల్లోనూ వారికి వారే మాట్లాడుకుని షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇతరులు వస్తే సమస్యలు సృష్టించాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఎక్సైజ్ అధికారుల ద్వారా ఇబ్బందులు పెడితే షాపులు వదులుకునేలా చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. పీలేరు నియోజకవర్గంలో కూటమి శ్రేణుల పన్నాగం నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ వారు షాపుల జోలికి వెళ్లని పరిస్థితి నెలకొంది. మిగిలిన చోట్ల ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది.

మద్యంషాపుల టెండర్లకు నేడే చివరి తేదీ

రాయచోటి: జిల్లా పరిధిలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 111 మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగుస్తుందని వైఎస్సార్ జిల్లా ఉమ్మడి డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. గురువారం రాత్రి రాయచోటిలోని ఈసీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అన్నమయ్య జిల్లా ఈసీ మధుసూదన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని మద్యం షాపులకు ఇప్పటి వరకు 1465 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటి ద్వారా రూ. 29 కోట్ల, 30 లక్షలు ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందన్నారు. అన్ని షాపులకు దరఖాస్తులు రావడం శుభపరిణామమన్నారు. షాపులు పొందాలన్న ఆశావహులు శుక్రవారం కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు శుక్రవారం రాత్రి 7 గంటలతో ముగియనుందన్నారు. ఈనెల 14వ తేదీ కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీస్తామన్నారు.



క్లుప్తంగా

దర్బారు సాయి నగర్‌లో దసరా మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో దర్గామాతాజీ, స్వామీజీ

రామాపురం : మండలంలోని నీలకంఠ్రా వుపేట సమీపంలోని దర్బారు సాయి నగర్‌లో దసరా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దేవీ నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులు తొమ్మిది అలంకారాలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రతి రోజు దర్బారు సాయి నగర్‌లో ఉచిత అన్నదాన కార్యక్రమాలతో పాటు సాయంత్రం పల్లకీ సేవలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం దర్బారు సాయి నగర్‌లోని దర్గామాతాజీని, సద్గురు దర్గాస్వామీజీని భక్తులు దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సత్యమయ్య స్వామిజీ, శంకరయ్య స్వామిజీలు పర్యవేక్షించారు.

ఫెర్టిలైజర్ లైసెన్స్ రద్దు

బి.కొత్తకోట : యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్టు అందిన సమాచారంతో మండలంలోని గట్టులోని ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాల్లో గురువారం వ్యవసాయశాఖ ఏడీఏ శివశంకర్, ఏఓ చంద్రశేఖర్‌లు తనిఖీలు నిర్వహించారు. మంజునాథ, వినాయక ఫెర్టిలైజర్స్‌లో తనిఖీ చేయగా మంజునాథ ఫెర్టిలైజర్స్‌లో సక్రమంగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం, స్టాక్ వివరాలను చూపకపోవడంతో 15 రోజుల పాటు లైసెన్స్‌ను రద్దు చేశామని ఏడీఏ తెలిపారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


గట్టు ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మదనపల్లెను జల్లెడ పట్టిన పోలీసులు

- పట్టణ, మండల పరిధిలో విస్తృతంగా కార్డెన్‌సెర్చ్
- 490 మంది పోలీసు సిబ్బందితో ప్రతి ఇల్లు తనిఖీ
- రికార్డులు లేని 140 టూవీలర్స్, 9 ఆటోలు స్వాధీనం


కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ


కార్డెన్‌సెర్చ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

మదనపల్లె : మదనపల్లె అర్బన్, రూరల్ పరిధిలో గురువారం వేకువజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణంలోని రామారావుకాలనీ, గౌతమీనగర్, ముజీబ్‌నగర్, వివేకానందనగర్, బాలాజీనగర్, చీకలగుట్ట, శివాజీనగర్, విజయనగర్ కాలనీ, గొల్లపల్లె, మండలంలోని నారమాకులతండాలో విస్తృతంగా సోదాలు జరిపారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ఇద్దరు డీఎస్పీలు, 11మంది సీఐలు, 31మంది ఎస్ఐలు, 390 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టిన పోలీసులు ఎలాంటి రికార్డులు లేని 140 టూవీలర్స్, 9 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లె మండలం నారమాకులతండాలోని అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరంపై దాడిచేసి, 500 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ...మదనపల్లె పట్టణంలో నేరాల సంఖ్య పెరుగుతుండటం, గంజాయి విచ్చలవిడి వినియోగం, అక్రమ రవాణా జరుగుతుండటంతో కార్డెన్‌సెర్చ్ నిర్వహించామన్నారు. పట్టణ శివారు ప్రాంతాలైన చంద్రాకాలనీ, అనపగుట్ట, అమ్మచెరువు మిట్ట, వీవర్స్‌కాలనీ, తదితర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, రౌడీషీటర్లుగా పేరున్న వ్యక్తులతో సంబంధాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గుర్తించినా తక్షణం పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించామని, వీటి కట్టడికి ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, సీఐలు చాంద్‌బాషా, రామచంద్ర, కళా వెంకటరమణ, రమేష్, ఎస్ఐలు చంద్రమోహన్, హరిహరప్రసాద్, అన్సర్‌బాషా, రహీముల్లా, తిప్పేస్వామి, చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

సుండుపల్లె : వినాయక చవితి ఉత్సవాల్లో గణేష్ లడ్డును దక్కించుకున్న మహిళ పూర్తి డబ్బులు చెల్లించలేదనే కారణంతో ఆమెపై దాడి చేశారు. వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని శివాజీనగర్‌లో తుమ్మటకల శాంతమ్మ, భర్త శివకుమార్, చిన్న కూతురు లహరి కాపురం ఉంటున్నారు. గత ఏడాది వినాయక చవితి గణేష్ లడ్డు వేలంపాటలో రూ. 40 వేలుకు లడ్డు దక్కించుకున్నారు. అయితే రూ. 24 వేలు చెల్లించడంతో మిగతా డబ్బులు చెల్లించలేదని శివాజీనగర్‌లో ఉండే మరో వర్గం పసుపులేటి ప్రహ్లాద, లోకేష్, సావిత్రి, అనూష, పురుషోత్తం, వెంకటయ్య, శ్రీనివాసులు, విజయలక్ష్మీలు లహరిపై దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన మహిళను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కువైట్‌లో హత్యకు గురైన వ్యక్తికి స్వగ్రామంలో అంత్యక్రియలు

కువైట్‌లో హత్యకు గురైన మండలంలోని సొంతంవారిపల్లి గ్రామ పంచాయతీ, గడ్డమీదపల్లెకు చెందిన వీరాంజనేయులు మృతదేహానికి గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వీరాంజనేయులు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆదివాసీ హత్యాకాండ రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు

రాయచోటి అర్బన్ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అబూజ్‌మాడ్‌లోని తెల్తులి - నెందూర్ ప్రాంతంలో ఈనెల 4వ తేదీన జరిగిన ఆదివాసి హత్యాకాండ రాజ్యాంగ విరుద్ధమని పౌరహక్కుల సంఘం నేతలు ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీఓ సభా భవనంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 4వతేదీన తెల్తులి- నెందూర్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్ద ఎత్తున దాడిచేసి 31 మంది ఆదీవాసీలను దారుణంగా చంపేశాయన్నారు. ఎప్పటిలాగే సంఘటనపై కట్టుకథను అల్లి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించాయన్నారు. సంఘటనలో మృతులు ఎంతమంది ? వారిలో మావోయిస్టులు ఎంతమంది? ఆదివాసీలు ఎంతమంది ? అసలు ఆ ప్రాంతంలో నిజంగా ఎన్‌కౌంటర్ జరిగిందా ? అనే అనుమానాలు ఎన్నో ఉన్నాయన్నారు. అటవీ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు పోరాడుతుండడమే రాజ్యహింసకు కారణమవుతోందని విమర్శించారు. ఎదురుకాల్పుల ఘటనపై నిజ నిర్ధారణకు వెళ్లే వారికి ఎలాంటి ఆటంకాలు, అడ్డంకులు ఎదురు కాకుండా చూడాలని వారు కోరారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి పి. రవిశంకర్, సభ్యుడు వంగిమళ్ల రమణ, సీపీఐ నాయకుడు విశ్వనాథనాయక్, బంజారా సంఘం నాయకుడు శంకర్ నాయక్, బహుజన రక్షణ సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలపై రాజకీయ పెత్తనం తగదు


డీఆర్ఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా మహిళలు, నాయకులు

రాయచోటి అర్బన్ : జిల్లాలో డ్వాక్రా సంఘాల నిర్వహణలో కూటమి నేతలు జోక్యం చేసుకోవడం, పెత్తనం చెలాయించడాన్ని మానుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్.వెంకటేశు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తమపై రాజకీయ పెత్తనాన్ని నిరసిస్తూ డ్వాక్రా మహిళలు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు మండలం ముడుపుల వేముల గ్రామ పంచాయతీలో గ్రామ సమాఖ్య సమావేశంలో మెజారిటీ సభ్యుల తీర్మానం లేకుండానే కూటమి నేతలు వీఓలు, సంఘమిత్రలపై పరోక్షంగా పెత్తనం చేస్తున్నారన్నారు. ప్రతినెల జరగాల్సిన వీఓ సమావేశం సక్రమంగా జరపకపోవడం తగదన్నారు. పీడీ సత్యనారాయణ రాజకీయాలు చేయాలనుకుంటే తొలుత తన ఉద్యోగానికి రాజీనామా చేసి తనకు నచ్చిన పార్టీలో చేరాలన్నారు. కార్యక్రమంలో పలు డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మంచి భోజనం, వసతి కల్పించకపోతే ఎలా?


రాయచోటిలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి


సిద్దవటంలోని బీసీ బాలుర వసతి గృహంలోని రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి గాయత్రి


వీరబల్లిలో వంటగదులను పరిశీలిస్తున్న సివిల్ జడ్జి ఆసిఫా సుల్తాన్

వసతి గృహాల పరిశీలనలో న్యాయమూర్తి

రాయచోటి : పేదింటి బిడ్డల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంటే వాటిని సక్రమంగా అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంపై సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఈ.ప్రసన్న అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం రాయచోటి కొత్తపేటలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. బాలికలు ఉంటున్న గృహంలో మరుగుదొడ్లు, తలుపులు లేకపోవడం, తాగునీటి శుద్ధిపరికరం లేక ఇబ్బంది పడుతున్న దృశ్యాలు, తాగునీటిని బయట నుంచి తెచ్చుకుంటున్న వైనం చూసి న్యాయమూర్తి చలించి పోయారు. పరిశీలనలో గుర్తించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ఎంతో ఉన్నతాశయాలతో పేద, మధ్యతరగతి పిల్లలు వసతి గృహాలలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అలాంటి చిన్నారులకు కనీస వసతులైనా కల్పించకుంటే ఎలా అంటూ వార్డెన్‌ను ప్రశ్నించారు. విద్యార్థులకు మంచి భోజనం, మంచినీరు వసతి కల్పించాలని సూచించారు.

సిద్దవటంలో..

సిద్దవటం : సిద్దవటంలోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను గురువారం సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి జడ్జి గాయత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల గదులను, స్టోర్ రూమ్, వంట గది, డైనింగ్ హాల్, టాయిలెట్స్, బాత్‌రూమ్‌లు, ఆఫీసులోని రికార్డులను పరిశీలించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల గదుల్లో ఫ్యాన్‌లు కొరతగా ఉన్నాయని, కిటికీల రెక్కలు దెబ్బతిన్నాయని, టాయిలెట్, బాత్‌రూమ్‌లకు తలుపులు లేకపోవడంపై వసతి గృహం అధికారి ప్రసాద్‌ను ప్రశ్నించారు. వసతి గృహం పరిశుభ్రంగా ఉండటంతో పాటు, రికార్డులు అన్నీ సక్రమంగా ఉండటంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు, కోర్టు, వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న బీసీ బాయ్స్ హాస్టల్‌ను గురువారం రాయచోటి జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాత్ రూమ్‌లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆమె సూచించారు. మెను ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని వార్డెన్‌కు సూచించారు.







కొబ్బరిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

– గుట్టు చప్పుడు కాకుండా ప్రాజెక్టు నీటిలో పడేసిన వైనం


ఎం.హరినాథ (ఫైల్)

కలికిరి : కొబ్బరిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామం వీర్లపల్లివాండ్లపల్లికి చెందిన ఎం.హరినాథ(47)ను ఈ నెల 2వ తేదీన బుధవారం అల్లాబక్ష్, మరో ఇద్దరు వ్యక్తులు టెంకాయలు దింపడానికి తీసుకెళ్లారు. టెంకాయలు దింపే క్రమంలో చెట్టుపై నుంచి హరినాథ కింద పడిపోయాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో భయపడిన అల్లాబక్షు, ఇద్దరు వ్యక్తులు హరినాథ మృతదేహాన్ని పీలేరు సమీపంలోని బాలంవారిపల్లి ప్రాజెక్టులో నీటిలో పడేశారు. అయితే హరినాథ రోజులు గడిచినా కనపడక పోవడంతో అతని సోదరుడు క్రిష్ణయ్య 8న సోమవారం కలికిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారించడంతో జరిగిన విషయాన్ని నిందితులు పోలీసులకు వివరించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో కలికిరి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి అన్వేష్ ప్రాజెక్టు వద్దనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు.

పెన్నాలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


జేమ్స్ మృతదేహం

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని పెన్నానది పాత బ్రిడ్జి వద్ద బుధవారం కడప బీడీ కాలనీకి చెందిన జేమ్స్ (28) పెన్నా నీటిలో గల్లంతైన విషయం తెలిసిందే. ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ పర్యవేక్షణలో గురువారం ఉదయం పోలీసులు స్థానిక ఈతగాళ్లచే నీటిలో గాలింపు చర్యలు చేపట్టి జేమ్స్ మృతదేహాన్ని వెలికి తీశారు. దీంతో మృతుని కుటుంబీకులు బోరున విలపించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సీఐ మాట్లాడుతూ పెన్నానది పాతబ్రిడ్జి రహదారికి ఇరువైపులా నదిలోకి ఎవరూ వెళ్లకుండా కంపతో కంచె వేశామన్నారు. అవగాహన లేకుండా పెన్నా నదిలోకి కొత్త వ్యక్తులు ఎవరూ దిగకూడదన్నారు. కొత్త వ్యక్తులు పెన్నానది ప్రాంతాల్లో ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మండల ప్రజలకు ఆయన సూచించారు.

రైలు కింద పడి ఆత్మహత్య


భానుప్రసాద్ (ఫైల్)

పీలేరు రూరల్ : రైలు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని మోడల్ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం మోడల్ కాలనీకి చెందిన బి. సహదేవ కుమారుడు బి. భానుప్రసాద్ (21) గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో తిరుపతి నుంచి గుంతకల్లు వెళుతున్న రైలు కింద పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కదిరి రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఫారెస్ట్ గార్డు..


ప్రమాదంలో మృతి చెందిన ఆర్. శంకర్

పీలేరురూరల్ : రోడ్డు ప్రమాదంలో రిటైర్డు ఫారెస్ట్ గార్డు మృతి చెందిన సంఘటన గురువారం స్థానిక మోడల్ కాలనీ సబ్‌స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ అంబువారిపల్లెకు చెందిన రిటైర్డు ఫారెస్ట్ గార్డు ఆర్. శంకర్ (73) ద్విచక్రవాహనంలో చిత్తూరు రోడ్డు వైపు వెళుతున్నారు. జీడీ నెల్లూరుకు చెందిన కిషోర్ ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆర్. శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కిషోర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ బాలకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెంపుడు కుక్క కరిచి మహిళ మృతి


మునిలక్ష్మి (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కె.బుడుగుంటపల్లి పంచాయతీ వికాస్ నగర్‌కు చెందిన మునిలక్ష్మి (35) అనే మహిళ గురువారం పెంపుడు కుక్క కరిచి మృతి చెందింది. గత కొన్ని రోజులుగా ఆమె ఒక కుక్కను పెంచుకుంటూ ఉండేది. రెండు రోజుల క్రితం ఉన్నఫళంగా కరవడంతో ఆమెకు రేబిస్ వ్యాధి సోకి మృతి చెందింది. ఈమె భర్త బేల్దార్ పనికి వెళుతుంటాడు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు.

చిరుత సంచారంపై భయపడొద్దు: రేంజర్ ధీరజ్

చిట్వేలి : గ్రామస్తులు భయపడవద్దని అన్ని చర్యలు తీసుకున్నామని చెర్లోపల్లి గ్రామస్తులకు ఫారెస్టు రేంజర్ ధీరజ్ భరోసా కల్పించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉన్న చిరుత చెర్లోపల్లి పరిసర ప్రాంతాలలో సంచరిస్తూ ఒక మేకను చంపి తినిందన్నారు. దీంతో గ్రామస్తులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకు రాగా గ్రామ పరిసరాలలో చిరుతను గుర్తించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బందితో పహారా పెట్టామన్నారు. టపాసులు కూడా పేల్చామన్నారు. విషయం తెలుసుకున్న సబ్ డీఎఫ్ఓ సుబ్బరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో జరిమానా, జైలు శిక్ష

గాలివీడు : వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. మండలంలోని నూలివీడు గ్రామ పంచాయతీకి చెందిన డేరంగుల రామకృష్ణకు వరకట్న వేధింపు కేసులో 498 ఏ సెక్షన్ కింద ఆరు నెలల జైలు శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ లక్కిరెడ్డిపల్లె జడ్జి షేక్ ఫైజ్‌కున్నీసా తీర్పు చెప్పారు. ఈ కేసును లక్కిరెడ్డిపల్లి ఏపీపీ సుధారాణి వాదించారు. గాలివీడు ఎస్ఐ రామకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ షఫీ పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి పాడి ఆవు, పాము మృతి



రామసముద్రం మండలం మూగవాడిలో విద్యుత్ తీగ తగిలి మృతి చెందిన పాడి ఆవు, పాము

రామసముద్రం : మండలంలోని మూగవాడి గ్రామానికి చెందిన తలారి రామకృష్ణ పాడి ఆవుకు విద్యుత్ తీగ తగిలి మృతి చెందింది. అలాగే మరొక పాము కూడా మృతి చెందింది. ఈ సంఘటన గ్రామ పొలిమేరల్లో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని పొలాల్లో విద్యుత్ తీగ నేలపై పడింది. ఆ ప్రదేశంలో పశువులు, గొర్రెలు మేస్తుండగా తలారి రామకృష్ణ ఆవుకు తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అదే చోట తీగను తాకిన పెద్ద పాము కూడా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మదనపల్లి విద్యుత్ శాఖ ఏడీ హరికుమార్ గురువారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైతులను విచారించగా మూడు రోజుల నుంచి విద్యుత్ తీగ తెగి కిందపడి ఉందని చెప్పారు. పాడి ఆవు మృతికి రైతుకు నష్టపరిహారం చెల్లిస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు.

ఆస్తి ధ్వంసంపై పలువురిపై కేసు నమోదు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ ఆస్తును గురువారం రాత్రి కొందరు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. కొందరు వ్యక్తులు ప్రహరీ, గేటు ధ్వంసం చేసేందుకు జేసీబీ, ఇటాచీ వాహనాలతో రాగా పటం చంద్రశేఖర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన సీఐ హేమసుందర్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. అలాగే వాహనాలను సీజ్ చేశారు. విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.